# మనం
# విశాఖపట్నం

అనకాపల్లి, అల్లూరి, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025 పేజీలు: 5


## ఆర్.బి.ఐ. మాజీ గవర్నర్‌కు
# కలెక్టర్ ఆత్మీయ స్వాగతం



విశాఖపట్నం, ఫిబ్రవరి 25 మనం న్యూస్: భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావుకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్లోని డాక్టర్ వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం నగరానికి వచ్చిన ఆయన్ని మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఆహ్వానించారు. ఈ క్రమంలో దువ్వూరి సుబ్బారావు కలెక్టరేట్ కు వెళ్లి కాసేపు కలెక్టర్ తో వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం ఏయూకు చేరుకున్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు
# సర్వం సిద్ధం



**పోలింగ్ ఏర్పాట్ల వివరాలను వెల్లడించిన రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకోనున్న 22,493 మంది ఉపాధ్యాయులు**

విశాఖపట్టణం, ఫిబ్రవరి 25 మనం న్యూస్: ఫిబ్రవరి 27వ తేదీన జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. 22,493 మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కు 48 గంటల ముందుగానే సైలెంట్ పిరియడ్ అమల్లోకి వస్తుందని, 144 అమల్లోకి వస్తుందని, ఆ సమయంలో ఎలాంటి ప్రచారాలూ చేయరాదని పేర్కొన్నారు. 25వ తేదీ సాయంత్రం 4.00 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెండ్ పిరియడ్

-మిగతా 2లో



### అధ్యాపకులతో
# మద్యం అమ్మించిన చరిత్ర వైసీపీది

**ఎవరు మంచి చేస్తారో బేరీజు వేసుకుని ఓటేయ్యండి**

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన రఘువర్మను గెలిపించాలన్న గంటా**

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 మనం న్యూస్: భవిష్యత్ తరాలకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన అధ్యాపకులతో మద్యం షాపుల దగ్గర ఉద్యోగాలు చేయించిన ఘనత మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం నాడు గురువులను ఘనంగా సత్కరించుకునే సత్ సంప్రదాయాన్ని

-మిగతా 2లో

# ఫిబ్రవరి 27న పారిశుధ్య కార్మికులకు సెలవు



**జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎస్.వి నరేష్ కుమార్.**

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 మనం న్యూస్: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు ఫిబ్రవరి 26వ తేదీన (బుధవారం) శివరాత్రి సందర్భంగా విధులు నిర్వహించెదరని, తమ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి యధావిధిగా చెత్తను అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ జీవీఎంసీ కమిషనర్ ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎస్.వి నరేష్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం రోజున అనగా ఫిబ్రవరి 26వ తేదీన పారిశుద్ధ్య కార్మికులు విధులు ఒక హాజరై యధావిధిగా వ్యర్థాలను సేకరిస్తారని, మరుచటి రోజు అనగా ఫిబ్రవరి 27వ తేదీన (గురువారం) పారిశుధ్య సిబ్బందికి సెలవు దినముగా ప్రకటించడమైనదని తెలియజేసారు. నగర ప్రజలు ఫిబ్రవరి 27వ తేదీన తమ వద్ద వున్న వ్యర్థాలను వీధులలో, బహిరంగ ప్రదేశాలలో, పబ్లిక్ బిన్లలో పడవేయకుండా ఫిబ్రవరి 28వ తేదీన (శుక్రవారం) నాడు తమ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి విభజించిన వ్యర్థాలను అందించి సహకరించాలని నగర ప్రజలకు జివిఎంసి ప్రధాన వైద్యాధికారి విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

ఉంటుందని స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఏఆర్వో, ఈస్ట్ ఏసీపీతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు, ఇతర అంశాల గురించి రిటర్నింగ్ అధికారి వివరించారు.



### 123 పోలింగ్ కేంద్రాల్లో ఓటెయ్యనున్న 22,493 మంది

ఉత్తరాంధ్ర పరిధిలోని 123 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి వద్ద అన్ని రకాల కనీస వసతులు కల్పించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ విధిస్తామని చెప్పారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా సుమారు 739 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించామని వివరించారు. అందులో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. వీరితో పాటు 148 మంది మైక్రో అబ్జర్వర్లు కూడా ఉంటారని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని వారిలో పురుషులు 13,508, మహిళలు 8,985 ఉన్నారని, వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వారందరికీ ఓటర్ స్లిప్పులను కూడా పంపిణీ చేశామని వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ ఛైర్లు సమకూర్చామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం ఎండ వేడిమి తగలకుండా షామియానాలు, తాగునీరు, బయోటాయిలెట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

### ఉత్తరాంధ్రలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

శ్రీకాకుళంలో 31, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విశాఖపట్టణంలో 13, అనకాపల్లిలో 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని రిటర్నింగ్ అధికారి వివరించారు. ఇదిలా ఉండగా శ్రీకాకుళంలో మొత్తం 5,035 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 3,416, మహిళలు 1,619 ఉన్నారని తెలిపారు. విజయనగరంలో 3,270 మంది పురుషులు, 1,953 మంది మహిళలు కలిసి 5,223 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పార్వతీపురంలో 1,574 మంది పురుషులు, 759 మంది మహిళలు వెరసి 2,333 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 1,488 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 920, మహిళలు 568 మంది ఉన్నారని చెప్పారు. విశాఖపట్టణంలో 2,539 మంది పురుషులు, 2,990 మహిళలు వెరసి 5,529 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. అనకాపల్లి జిల్లాలో 2,885 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,789 మంది పురుషులు, 1,096 మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు.

### ఫిబ్రవరి 27 ఉదయం 08.00 నుంచి సాయంత్రం 04.00 గంటల వరకు పోలింగ్

పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 08.00 నుంచి సాయంత్రం 04.00 గంటల వరకు జరగనుందని, దీనికి సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను అధికార యంత్రాంగం మొదలు పెట్టిందని విశాఖపట్టణం జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. మార్చి 03వ తేదీన కౌంటింగ్ ప్రారంభమవుతుందని, 08వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని స్పష్టం చేశారు.

### ఏయూలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు

పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసేందుకు అనువుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. 26వ తేదీ ఉదయం 6.00 గంటల నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందజేస్తారని చెప్పారు. అలాగే 27వ తేదీ సాయంత్రం 6.00 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది నుంచి రిసెప్షన్ కేంద్రం వద్ద మెటీరియల్ స్వీకరిస్తారని పేర్కొన్నారు. మెటీరియల్ ను, సిబ్బందిని తరలించేందుకు అనువుగా తగినన్ని వాహనాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అన్ని జిల్లాలకు తగినంత మెటీరియల్ సిద్ధం చేశామని పేర్కొన్నారు.

### శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగినంత మందిని నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు తీసుకెళ్లరాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హోటళ్లు, లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లలో ముందస్తు తనిఖీలు నిర్వహిస్తామని, అనుమానిత వ్యక్తులు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సైలెంట్ పిరియడ్ అమల్లో ఉన్న సమయంలో బయట జిల్లాల వ్యక్తులు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఉండరాదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, తూర్పు ఏసీపీ మూర్తి పాల్గొన్నారు.

---

# అధ్యాపకులతో మద్యం అమ్మించిన చరిత్ర వైసీపీది

**మొదటి పేజీ తరువాయి**

తెలుగుదేశం పార్టీ తీసుకు వచ్చిందని తెలిపారు. ఎవరి హయంలో విద్యారంగం అభివృద్ధి చెందిందో బేరీజు వేసుకుని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండే వర్మ పట్ల ఉపాధ్యాయ లోకం సానుకూలతతో ఉందన్నారు. అధ్యాపకుల అభిప్రాయాలకు విలువనిచ్చే విద్యా శాఖ మంత్రి లోకేష్ నేతృత్వంలో ఆ రంగం విశేష అభివృద్ధి చెందుతుందని చెప్పారు.



### ₹ఊసరవెల్లి మాటల జగన్₹

టీడీపీకి 23 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నప్పుడు కనుసైగ చేస్తే ప్రతిపక్ష హోదా పోతుందని వెటకారంగా మాట్లాడిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు కేవలం 11 మంది ఎమ్మెల్యేల బలంతో ప్రతిపక్ష హోదా డిమాండ్ చేయడం ఊసరవెల్లిని గుర్తు చేస్తుందని గంటా శ్రీనివాసరావు మండిపడ్డారు. వై నాట్ 175 అంటూ ఎన్నికలకు వెళ్లి 11 సీట్లకు పరిమితమైన జగన్ ప్రజా తీర్పు నుంచి గుణపాఠం నేర్వకపోవడం విచారకరమన్నారు. సభ్యత్వం పోతుందనే తపనతోనే అసెంబ్లీకి హాజరయ్యారు తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని మాజీ సీఎం వైఖరిని తప్పు పట్టారు. అయిదేళ్ల అధికారంలో ఒకే ఒక్కసారి మీడియా సమావేశాన్ని నిర్వహించిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఆ మీడియా ద్వారానే ప్రభుత్వంపై పోరాడతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకప్పుడు వైసీపీ అనే పార్టీ ఉండేదని, తర్వాత చరిత్ర పుటల్లో కలిసి పోయిందని భావితరాల వారు పుస్తకాల్లో చదువుకుంటారని తెలిపారు. వైసీపీ మునిగిపోయిన పడవ అని ఏరోజు ఎవరు ఆ పార్టీ వీడుతారో తెలీని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. ఆఖరికి ఏ-2 విజయసాయి రెడ్డి కూడా ఆ పార్టీకి గుడ్ బై చెప్పారని, దీనంతటికీ జగన్మోహన్ రెడ్డి ఒక్కరే కారణమన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి పాల్గొన్నారు.

# పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి గెలిపించాలని కోరుతూ పరవాడలో విస్తృత ప్రసారం

అనకాపల్లి జిల్లా, ఫిబ్రవరి 25 మనం న్యూస్: పరవాడ మండలంలో మంగళవారం పిడిఎఫ్, యుటిఎఫ్ నాయకులు పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరీ పరవాడ బాలురు, బాలికల హై స్కూల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం విజయ్ గౌరి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయుచున్న కే విజయ గౌరి అనే నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎందుకంటే

ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఓటు ఎవరికి వేయాలి? ఎవరికి వేయకూడదు? ఎందుకు వేయాలి? ఎందుకు వేయకూడదు? అనే దానిపై ప్రతి చోట చర్చ జరుగుతున్నది. ఇలాంటి సందర్భంలో ఉపాధ్యాయుల ఉపాధ్యాయులు అంటేనే ప్రశ్నించేవారు. శాసన మండలి దాని ఉద్దేశ్యం పూర్తిగా నీరు గార్చే విధంగా రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలను మార్చేశాయి.

కాబట్టి ఇలాంటి సందర్భంలో ఉద్యోగులు, ఉపాద్యాయులు కోసం నిరంతరం ఉద్యమాలే ఊపిరిగా పీడీఎఫ్ అభ్యర్థులు ఇప్పటికే పోరాటం చేస్తున్న నేపథ్యంలో ఎవరికి ఓటు వెయ్యాలి అనే విషయాన్ని



₹నిర్ణయించు కోవాల్సింది, ఎంచుకోవాల్సింది ఉపాధ్యాయులే₹

కాబట్టి శాసనమండలి యొక్క ఉద్దేశాన్ని నెరవేర్చి, హోదాని, ఉన్నతిని కాపాడే నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రతిరోజు పోరాటం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి గారికి మీ ప్రధమ ప్రాధాన్యత ఓటు వేసి ఉత్తరాంధ్ర నుంచి ఒక ఉత్తమ మహిళను శాసనమండలికి పంపించవలసినదిగా ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆమె తెలియజేస్తూ విజయ గౌరీ సీరియల్ నెంబరు ఒకటి లో ఒకటి వేసి శాసనమండలి కి పంపించాలని ఈనెల ఫిబ్రవరి 27 ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది కాబట్టి తప్పనిసరిగా వచ్చి అత్యధిక ఓట్లు మెజార్టీతో విజయ గౌరని గెలిపించాలని విజయ్ గౌరీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.పిడిఎఫ్ నాయకులు ప్రకాష్, రాము, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# కొండను చూపించి కోట్ల రూపాయలు కాజేశారు

దేవిపట్నం: మనం న్యూస్: ఫిబ్రవరి 25 :అల్లూరి సీతారామరాజు జిల్లా దేవిపట్నం మండలం కొండను చూపించి కోట్ల రూపాయలు కొట్టేశారు. దేవీపట్నం మండలం దండింగి రెవెన్యూ విలేజ్ లో సుమారు 82 ఎకరాల భూమిని దళారులు కొంతమంది సుమారు 6 కోట్ల 17 లక్షల రూపాయలను తప్పుడు బిల్లును పెట్టి దోచుకున్నారు. ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే పోలవరం ముంపు లో లేని కొండను చూపించి తప్పుడు పట్టాలతో పాటు అప్పుడు వీటిపై 2005 సమాచార హక్కు చట్టం ప్రకారం రిపోర్టు తెప్పించుకోగా వీటిపై మా వద్ద ఏ విధమైన రికార్డులు లేవని సమాధానం ఇచ్చి ఉన్నారు ఈ 83 ఎకారములపై అన్ని ఆధారములు చూపించుటకు సిద్ధంగా ఉన్నానని మట్టా మెహర్ బాబా గౌడ్ తెలియజేసినారు ఈ 83 ఎకరంలో మా తాత ముత్తాతల కాలంనాటి సుమారు 10 ఎకరంలు భూమిలో ఐదు ఎకరం భూమికి తప్పుడు పట్టాలు పెట్టి సుమారు 38 లక్షల రూపాయలు దళారులు దోచుకున్నారు ఆ భూమిపై నాలుగు ఎల్ టి ఆర్ పి ఒక సెటిల్మెంట్ ఆర్డర్ ఒక సీఎం ఏ ఆర్డర్ హై కోర్ట్ ఆర్డర్ అన్నీ ఉన్న దళారులు మాయ చేశారు ఇటువంటివి ప్రభుత్వ భూములు ఎన్నో కాజేశారు

ఈ దళారుల మీద కూటమి ప్రభుత్వం సిబిఐ ఈడి ఎంక్వయిరీ ఏసి తొందరగా ఇంట్రగేషన్ చేయిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయి అని గిరిజనులు గిరిజనునేతల్లో కోరుకుంటున్నారు.

# శ్రీ అసంగానంద ఆశ్రమం, శ్రీమృత్యుంజయశ్వరా ఆలయం, పెద్దవాళ్తేరు లో 26న మహాశివరాత్రి వేడుకలు

విశాఖపట్నం ఫిబ్రవరి 25 మనం న్యూస్: శ్రీ అసంగానంద ఆశ్రమం, శ్రీమృత్యుంజయశ్వరా ఆలయం, పెదవాలతేర్లో ఈ సందర్భంగా మహాశివరాత్రి సందర్భంగా ఆశ్రమ అధ్యక్షులు

శ్రీ విష్ణు సేవనంద గిరి స్వామి పర్యవేక్షణ లో ఆలయం లో ఉదయం 4గంటల నుండి శివలింగానికి పంచామృతాలతో అభిషేకం సాయంత్రం 4గంటలకు పురవీదుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సాయంత్రం 6గంటలకు గంగా, యమున, సరస్వతి, కృష్ణ, గోదావరి నది జలలతో (పంచినధీ జలాలు )అభిషేకం,రాత్రి 12గంటలకు లింగోద్భావ సమయం లో పాలాభిషేకం రాత్రి ఒంటిగంటకు రుద్రాభిషేకం ఉంటుంది. సాయంత్రం 5గంటలనుండి 12గంటల వరకు నాట్యపరిమళ మ్యూజిక్ డాన్స్ అకాడమీ శ్రీమతి లీపికా రెడ్డి , రాగమాలిక సాంస్కృతిక సేవాసంస్థ కె. వి. సత్యనారాయణ మరియు మాస్టర్ ప్రసాద్రావు ఆధ్వర్యంలో కీర్తనలు, భక్తి పాటలు, శివ సంకీర్తనలు జరుగుతాయని, అభిషేకలు స్వయంగా



భక్తులే చేస్తారని, వచ్చిన భక్తులకు రాత్రి అల్పాహారం ప్రసాదం ఉంటుందని ఆలయ ట్రాష్టి , ఉపాధక్షులు ఎం. వి. శ్రీనివాస రెడ్డి తెలిపారు ఈ సమావేశం లో ట్రస్ట్ సభ్యులు కాగితాల సత్యనారాయణ రెడ్డి, సి. హెచ్. హనుమంత రావు, విశ్వేశ్వర రావు, చిన్న, నారాయమ్మ, అప్పారావు పాల్గొన్నారు

# యువతని మోసగించిన కేసులో వ్యక్తికి జైలు శిక్ష

అడ్డతీగల: మనం న్యూస్: ఏజెన్సీ అడ్డతీగల సర్కిల్ పరిధిలోని గంగవరం మండలం పాత రామవరం గ్రామానికి చెందిన గూడెం రాయుడు అనే వ్యక్తి 2023 వ సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమ పేరుతో మోసగించి గర్భవతిని చేసి తీరా ముఖం చాటేయడంతో ఆ యువతి గంగవరం పోలీసులను ఆశ్రయించి నాటి అధికారుల సమక్షంలో కేసు నమోదు చేయడం జరిగిందని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి తెలిపారు అందులో భాగంగా సుమారు రెండు సంవత్సరాలు జిల్లా కోర్టులో న్యాయ విచారణ జరిపిన తర్వాత ముద్దాయి గూడెం రాయుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఈరోజు తీర్పు వెలువరించినట్లు సిఐ నరసింహమూర్తి పేర్కొన్నారు .

# కోరెడ్ల విజయగౌరీని గెలిపించాలని విస్తృత ప్రచారం

ముంచంగిపుట్టు ఫిబ్రవరి 25 (మనం న్యూస్): పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీనీ గెలిపించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు.యూటీఎఫ్ మరియు వివిధ ఉపాద్యాయ,అధ్యాపక సంఘాలు మద్దతుతో పిడిఎఫ్ ఉపాద్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొరెడ్ల విజయ గౌరీ పోటీలో ఉన్నారు, వారికి క్రమ సంఖ్య ఒకటిలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాద్యాయలతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కొర్రా త్రినాథ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నిర్వీర్యం చేయుటకు 117 జిఓ తీసుకువస్తే ఆ రోజు వ్యతిరేకించిన నేటి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి దానిని కొనసాగిస్తుందని అన్నారు.గిరిజన ప్రాంతంలో ఉద్యోగ,ఉపాధి కోసం 100 శాతం రిజర్వేషన్ కల్పించే జిఓ నెంబర్ 3 రద్దు చేసిన స్పందించని సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ మద్దతుతో పోటీలో ఉన్న ఆయన ప్రభుత్వం చేసే ప్రతి పనికి మద్దతు ఇస్తారని దానితో గిరిజన ప్రాంతం విద్యా వ్యవస్థ నాశనం అవుతుందని, ఉపాద్యాయ, ఉద్యోగ,నిరుద్యోగులకు అన్యాయం జరుగు తుందని,అందుకే పోరాట చరిత్ర కలిగిన యూటీఎఫ్ అలాగే వివిధ ఉపాద్యాయ సంఘాలు మద్దతుతో పిడిఎఫ్ ఉపాద్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల.విజయ గౌరీని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని అన్నారు. విజ్ఞులైన ఉపాద్యాయ,అధ్యాపక మేధావి వర్గం ఆలోచన



చేసి ఎటువంటి ప్రబోలాలకు గురికాకుండా ఓటు వేయాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. జరుగుతుంది, ఈ కార్యక్రమంలో ఉపాద్యాయలు తోపాటు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

**మండల కూటమి నాయకులు**

**కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం**



దేవీపట్నం:మనంన్యూస్: పిబ్రవరి 25: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ దేవీపట్నంలో ఉమ్మడి ఉభయ గొదావరి జిల్లాల పట్టభద్రుల ఏమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కు కృషి చేయాలనీ మండల కూటమి నాయకులు ఇందుకూరు పేట గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు.కూటమి నాయకులు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నిరుద్యోగులు ఉపాధి ఉద్యోగుల అవకాశాలు కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమని ప్రజా సమస్యలు పరిష్కరించే సత్తా కూటమి ప్రభుత్వానికే ఉందని అందుకే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు మేధావులు గెలిపించాలని నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం విజన్ ఉన్న నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావూస్ వెళ్లి కంపెనీలతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరి ఉన్నారని ఉద్యోగస్తుల, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావడానికి కూటమి ప్రభుత్వం పై నమ్మకం ఉంచి కూటమి అభ్యర్థి అయిన పెరబత్తుల రాజశేఖరం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు... కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జిరాష్ట్ర రైతు కార్య నిర్వాహక కార్యదర్శి మాగపు బాబురావు,రాష్ట్ర ఎస్ సి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి గోళ్ళ చంటి బాబు, మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసుధనరావు,తైలం గంగాధర్, నియోజవర్గ టీడీపీ మీడియా కోఆర్డినేటర్ కేశవరపు చంద్రకుమార్ (పండు),టైలర్ నానీ,అడబాల వెంకటేశ్వర్రవు, సోమరెడ్డి రామకృష్ణ, పుట్టపల్లి మలేష్, పాతాళ వీర పండు,కామరపు శివ రెడ్డి,మరియు జనసేనపార్టీ మండల అధ్యక్షులు చారపు వెంకటరాయుడు, ఉపాధ్యక్షులు కర్రి మహేష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కొమరం దొరబాబు, మీడియా కోఆర్డినేటర్ కారం దుర్గాప్రసాద్,తాళ్లూరి పవన్ కుమార్ రెడ్డి, కోండ్ల సురేష్ రెడ్డి, మట్ట నరసింహమూర్తి (కాపు)తదితరులు పాల్గొన్నారు.




# ముగిసిన జ్యూట్ బ్యాగ్ తయారుచేసుకొనే శిక్షణా కార్యక్రమం

విజయనగరం జిల్లా, ఫిబ్రవరి 25 మనం న్యూస్: సంకల్ప్ పథకం క్రింద, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జన శిక్షణా సంస్థాన్ ద్వారా నెల రోజుల పాటు జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణా ఇవ్వటం జరిగింది. ఈ శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్య అబివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు అందరు కూడా ఈ శిక్షణా కార్యక్రమమును సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని మరియు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొరటం జరిగింది.అలాగే ఈ కార్యక్రమంనకు జన శిక్షణా సంస్తాన్ చైర్మన్ డి.రమేష్, డైరెక్టర్ వి.హరీష్ ,నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీ ఎస్ డి ఓ ఎస్.షణ్ముఖ రెడ్డి, ప్లేస్మెంట్ అధికారి టి. భాస్కర్ పాల్గొనటం జరిగింది.

# మత్స్యగెడ్డలో గల్లంతైన గిరిజనులు మృతదేహం లభ్యం

ముంచంగిపుట్టు ఫిబ్రవరి 25 (మనం న్యూస్): అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం మండలంలో గల సుజనకోట పంచాయతీ బీటా గ్రామానికి చెందిన గిరిజన మత్స్యకారుడు సీసా జలంధర్ (44) ఆదివారం ఉదయం నాటు పడవ సహాయంతో మత్స్య గెడ్డలో చేపలు వేటకు వెళ్లి గ్రామ సమీపంలో నాటు పడవ మునిగి గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు మండల తహశీల్దార్, పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం నాటు పడవతో చేపలు వేటకు వెళ్లి చేపలు పెట్టే సమయంలో నాటు పడవ రంధ్రం ఏర్పడి ఉండడంతో గమనించక పోయినా జలంధర్ చేపలు వేట కొనసాగిస్తున్న సమయంలో పడవ రంధ్రం ద్వారా ఒక్కసారిగా నీరు లోపలికి చేరి పడవ మునిగి మత్స్య గెడ్డలో గల్లంతయ్యాడు. గత మూడు రోజులుగా రెవిన్యూ సిబ్బంది, పోలీసులు బంధువులు కుటుంబీకులు, ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మధ్యాహ్నం12 గంటల సమయంలో జలంధర్ మృతదేహం లభ్యమయింది. దీంతో స్థానిక సర్పంచ్ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక సిహెచ్ సి కు తరలించారు. వైద్యాధికారి సంతోష్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్ప గించారు. దీంతో కుటుంబ సభ్యులు బీట గ్రామానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. గాలింపు చర్యల్లో తహశీల్దార్ నర్సమ్మ, ఏఎస్ఐ తిరుపతిరావు, వీఆర్వో భాస్కరరావు, రెవిన్యూ సిబ్బం ది పోలీస్ సిబ్బంది సచివాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం స్పందించి మత్స్య గెడ్డలో మృతి చెందిన జలంధర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక స హాయం అందించాలని సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సు బ్బలక్ష్మి లతోపాటు బంధువులు ప్రభుత్వానికి కోరారు.







# వైద్య సేవల్లో నిరంతర పురోగతి సాధించాలి

**డిసిహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మి**

అడ్డతీగల: మనం న్యూస్: ఏజెన్సీలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవల్లో ఎప్పటికప్పుడు నిరంతర పురోగతిని సాధించి నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి జిల్లా ఆసుపత్రుల విభాగం వైద్య సేవల కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి సూచించారు మంగళవారం ఆమె అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి తో పాటు వైరామవరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా ఆమె వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించారు అనంతరం అన్ని విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ఎవరు ఇబ్బంది పడకుండా సకాలంలో వైద్య సేవలు అందించాలని అందులో సిబ్బంది అలసత్వం వహించరాదని వెల్లడించారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మందుల కొరత రానీయకుండా అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సతీష్ ఇతర వైద్య సిబ్బంది వై రామవరం వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# భాష వాలంటర్‌ను నియమించాలని విద్యాశాఖ అధికారికి వినతి

ముంచంగిపుట్టు ఫిబ్రవరి 25 (మనం న్యూస్) : అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం కరిముఖిపుట్టు పంచాయతీ తాంగుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒడియ భాష వాలెంటర్ ను నియమించాలని తాంగుల ఎంపీపీ పాఠశాల ఎస్ఎంసి కమిటీ సభ్యులు మండల విద్యాశాఖ అధికారి కు మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు.తాంగుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు 28 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. అయితే తమ గ్రామంలో మాతృభాష ఒరియా గా ఉండటం వలన ఒకటి,రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధించుటకు ఇబ్బంది పడుతున్నారని, కావున మాతృభాష అయిన ఒరియాలోని బోధించుటకు ఒక ఒరియా మాతృభాష వాలంటర్ ను నియమించాలని మండల విద్యాశాఖ అధికారికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి కమిటీ సభ్యులు జి చంద్రకళ, జి బంగారమ్మ, జి ఇందిరమ్మ, జి నాగరాజు, జి భవాని, జి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ అంటే ఫీడ్బ్యాక్ ఇవ్వకుండా ఉండరు

**ఏడిసి సోమన్నారాయణ**




మధురవాడ ఫిబ్రవరి 25 మనం న్యూస్ : స్వచ్ఛ సర్వేక్షన్ 2024 ప్రజా అభిప్రాయల సేకరణలో భాగంగా మంగళవారం నాడు జీవీఎంసీ ఆరో వార్డు పరిధి పీఎం పాలెం వీ కన్వెన్షన్ సెంటర్లో పారిశుద్ధ సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ, జీవీఎంసీ సీఎంఒ డాక్టర్ నరేష్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడిసి సోమన్నారాయణ మాట్లాడుతూ విశాఖ ని అందంగా తీర్చిదిద్దేందుకు తెర వెనక ఉండి అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సేవలకు సమాజంలో ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రజలిచ్చే స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్బ్యాక్ విశాఖకి మొదటి ర్యాంక్ తో పాటు పారిశుద్ధ్య కార్మికులు శ్రమకి తగిన గుర్తింపుని తీసుకొస్తుందన్నారు. జోన్ టూ ప్రాంతంలో లక్షకు పైగా గృహ నిర్మాణాలు ఉన్నాయని తద్వారా రెండు లక్షల పైగా ప్రజలు నివసిస్తున్నారన్నారు. రోజురోజుకి అభివృద్ధి పథంలో విస్తరిస్తున్న జోన్ మధురవాడ ప్రాంతం కనుక ఎక్కువ శాతం ఫీడ్బ్యాక్ వస్తుందని ఆశ భావం వ్యక్తం చేశారు. దీనికి ప్రస్తుతం మధురవాడ జోన్ లో 4500 పైగా మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయని ఒక్కో గ్రూపు కి 50 ఫీడ్బ్యాకులు చొప్పున 10 రోజుల నిర్ణీత గడువులో నాలుగు నుండి ఐదు లక్షల ఫీడ్బ్యాక్లు సులభంగా సాధించవచ్చునని ఆయన పేర్కొన్నారు. మహిళలు నడుంబిగిస్తే మహా విశాఖ మొదటి ర్యాంకు సాధించడంలో అతిశయోక్తి లేదన్నారు. అదేవిధంగా మెరుగైన పనితీరు కనిపించిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుంది అన్నారు. సెక్రెటరీ నుండి ఆర్పి ల ద్వారా మహిళా సంఘాల తో మమేకమై ఒక ప్రణాళికతో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని కోరారు. యు సి డి విభాగంలో మహిళా సంఘాలు ఈ స్వచ్ఛ సర్వేక్షన్ లో పాల్గొని హోం కంపోస్ట్ లో కూడా చురుగ్గా పనిచేసి ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షన్ పై అవగాహన పరిచే మెరుగైన ర్యాంకు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆర్పి లందరూ ప్రతిరోజు వారి నివేదికను ఏపీడీల ద్వారా జెడ్ సి కి అందజేయాలన్నారు. ఇక ప్రతి రోజు నుండి రోజుకు 30 వేల ఫీడ్బ్యాక్లు జోన్ నుండి అందించేలాగా కృషి చేయాలని కోరారు. విశాఖను అందంగా చూపించడంలో ఎలా పనిచేస్తున్నామో ఆ పనితనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం కూడా ప్రధానమైన పని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ టు జోనల్ కమిషనర్ కె కనకమహాలక్ష్మి, ఏఎంహెచ్వో ఎన్ కిషోర్ ,ఏ పి డి శ్రీరామ్, జోన్ టు శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, యు సి డి విభాగం సి ఓ లు, పారిశుధ్య సెక్రటరీలు, మహిళా పొదుపు సంఘాల ఆర్పీలు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

గంగవరం :మనంన్యూస్: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ గంగవరం స్థానిక ఆశ్రమం బాలిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వరలక్ష్మి వార్డెన్ మడకం లావణ్య ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థినిల వీడుకోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని సీనియర్ ఉపాధ్యాయుని ఉమాదేవి ప్రారంభించగా ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి టి మల్లేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ పలువురు ప్రజా ప్రతినిధులు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా విద్యార్థినీలు పలువురు ఉపాధ్యాయులు ఆటపాటలతో నృత్యాలతో అలరించారు. అనంతరం వీడుకోలు కార్యక్రమాన్ని పురస్కరించుకొని తల్లిదండ్రులకు ప్రజాప్రతినిధులకు అధికారులకు విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బేబీ రత్నం వైస్ ఎంపీపీ గంగాదేవి స్థానిక ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించిన ఎస్ఎస్ఏ పి ఓ

ముంచంగిపుట్టు ఫిబ్రవరి 25 (మనం న్యూస్) : అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం కిలగడ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ అధికారి వి ఏ స్వామి నాయుడు మంగళవారం సందర్శించారు. మనబడి మన భవిష్యత్తు కు సంబంధించి అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. లక్షలు ఖర్చు చేసిన కనీసం పునాది స్థాయి దాటని కట్టడాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు తరగతుల నిర్మాణాలకు ప్రిన్సిపల్ కు వివరణ కోరగా సరైన సమాధానం రాకపోవడంతో దీనిపై సమగ్ర విచారణ చేపట్టడం కోసం సమగ్ర శిక్ష డి ఈ ఈ ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పదార్థాలను పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.



# గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న జగన్‌పై అనర్హత వేటు వేయాలి

**తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 మనం న్యూస్: కేవలం అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శాసనసభకు హాజరయ్యారని .. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. మంగళవారం హోటల్ దసపల్లా లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గవర్నర్ అబ్దుల్ నజీర్ శాసనసభలో ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు నినాదాలు చేయడాన్ని రామ్ తప్పు పట్టారు. ఇటువంటి అప్రజాస్వామ్య చర్యకు మూల కారకుడైన వైయస్ జగన్మోహన్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని స్పీకర్ సి.హెచ్ అయ్యన్నపాత్రుడు ను బి.వి.రామ్ కోరారు. స్వయంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సోదరి.. వైయస్ షర్మిల కూడా అతని వైఖరిని తప్పుపట్టారన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు పట్టుమని పదకొండు నిమిషాలు కూడా శాసనసభలో లేకపోవడం ఏమిటని అభ్యంతరం వ్యక్తం చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కొనసాగించిన ప్రజా వ్యతిరేక పాలన పై తాను ప్రజాస్వామ్యబద్ధంగా యుద్ధం చేశానన్నారు. ఈ క్రమంలోనే తొమ్మిది పాటలను విడుదల చేసి వైసిపి దుర్మార్గాలను ప్రజలలోకి తీసుకెళ్లానని తెలిపారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా జగన్ కు వ్యతిరేకంగా సమావేశాలు ఏర్పాటు చేశానని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పులి కాదని.. పిల్లి అని అసెంబ్లీలో వ్యవహరించిన తీరును బట్టి స్పష్టం అవుతుందన్నారు. ఏది ఏమైనా నైతిక విలువలు లేని వైయస్ జగన్ పై అనర్హత వేటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఏ తప్పు చేయకుండానే అన్యాయంగా 53 రోజులపాటు జైలులో నిర్బంధించారన్నారు. ఒకవేళ చంద్రబాబు నాయుడుకి నిజంగా కక్ష సాధింపు ఉంటే వైసిపి నేతలు అందరూ జైలుకు వెళ్లేవారు అన్నారు.

### ఎమ్మెల్సీగా నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించాలి

ఎమ్మెల్సీ ఎన్నికలలో నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. తాజాగా ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బి.వి.రామ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ మీడియా సమావేశంలో జి. వీరభద్రరావు, డాక్టర్ కె.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

